


-ముచ్చర్ల రజనీశకుంతల

ఒక్క క్షణం మొగుడి వంక సీరియస్‌గా చూసింది సత్యభామ. ఆ క్షణం సద్దాం హుస్సేన్, జార్జిబుష్, బిన్‌లాడెన్, ముషారఫ్‌ల ఫేస్‌లు మిక్సీలో పేస్టయి మొగుడి మొహంలో మాస్క్‌లో అతుక్కుపోయినట్టు అనిపించింది. మిస్టర్ సత్యభామ మాత్రం పెళ్లామ్ వంక చిద్విలాసంగా చూసి "ఆర్యూ నాట్ కంఫర్టబుల్?" అనడిగాడు.

"హు...(...కంఫర్ట్...అన్ కంఫర్ట్...ట్యాంక్‌బండ్‌కు వెళ్తూ కూడా ఇంత కంపును చూడ్లేదు. వర్షాకాలంలో హైద్రాబాద్ రోడ్ల మీద కూడా ఇంత కంపు ఇంపుగా కనిపించలేదు. అయినా మీరిలా నిమ్మకు నీరెత్తినట్టు ఎట్లా ఉండగలరు? పైగా పెసరట్టు, ఉప్మా తింటూ కూడా నాకైతే వాక్...యాక్...డోక్..." అంది సత్యభామ.

దీనికంతటికీ కారణం ఎ....లు...క.

గత పదిహేనురోజులుగా ఆ ఇంట్లో ఆ ఎలుక సృష్టించే న్యూసెన్స్ అంతా ఇంతా కాదు. అది న్యూస్ పేపర్లని తినేసి అందులోని కుళ్ళు వార్తలను, రాజకీయనాయకుల కుంభకోణాలను, గ్యాసిప్‌లను సిప్ చేసి వామ్టింగ్ చేసుకున్నా ఫీలవలేదు. కిచెన్‌లో వీరవిహారం చేసింది.

క్రికెట్ బ్యాట్‌ని కొరికింది, షూస్‌ని కొరికింది.....ఇలా చాలాచాలా కొరికి పారేసింది.

అయినా వాటిని బయట పారేసింది కానీ కిమ్మనలేదు సత్యభామ.

పైగా పాపం ఎలుక...పైగా వినాయకుడి ఫేవరెట్ వెహికల్ అని ఊర్కుంది. అప్పటికీ ఆవిడ ఆరేళ్ల కొడుకు అను అనబడే అనురాగ్ మాత్రం-

"మమ్మీ వినాయకుడంకుల్ వెహికల్ ఎలుక మనింట్లో తిరిగే ఎలుక ఒకరు కాదు. కేస్ట్‌లో, రెలిజియన్స్‌లోనో డిఫరెంట్ అయి ఉంటాయి" అన్నలా పాయింట్ ఒకటి లాజిక్ పీకాడు.

రాత్రులు మంచం మీద చేరి కిటకిటమంటూ, ఉదయాలు కిచెన్‌లో పటపటలాడిస్తూ, సాయంత్రాలు హాలులో యథేచ్ఛగా వాకింగ్‌లు, రన్నింగ్‌లు చేస్తూ తమాషాలు చేస్తోంది ఆ ఎలుక.

కొందరు గెస్ట్‌లైతే "ఏంటీ కుక్కకు బదులు ఎలుకను పెంచుతున్నావా?" అని మొహానే అడిగేశారు.

ఆ క్షణం ఆ 'ఎలుక'ని తీసికెళ్లి అలా మొహమ్మీదే అడిగేసిన ఆడపడుచు మనీ బ్యాగ్‌లో వేయాలన్నంత కసి వచ్చినా మిన్నకుండిపోయింది. ఆ ఎలుకను క్షమించేసింది. పోనీలే.. పుడ్డు కోసమే కదా అని.

కానీ అట్లాంటి ఎలుక సత్యభామకు కోపం వచ్చే పన్జేసింది. సత్యభామ రాసిన సీరియల్ తాలూకు లాస్ట్ ఛాప్టర్ తాలూకూ లాస్ట్ పేజీని కాస్త టేస్ట్ చేసి వదిలింది ఆ ఎలుక.

అసలే టెన్షన్... లాస్ట్ ఛాప్టరో...లాస్ట్‌ఛాప్టరో అని పత్రికవాళ్ళు అడుగుతుంటే అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉండి తెల్లవారుఝామున క్లయిమాక్స్ రాసి హమ్మయ్య అని రిలాక్స్ అయి అలా కళ్ళు మూసుకుని ఇలా ఓ రెండుగంటల తర్వాత కళ్ళు తెరిచిందో లేదో క్లయిమాక్స్ లైన్ ఉన్న పేపర్‌ని కొరికేస్తోంది ఎ...లు..క.

అంతే. అప్పుడు మండింది సత్యభామకు. మూడొందల కథలు, పాతిక నవలలు రాసినా వాటి తాలూకు ఒరిజినల్ మాన్యుస్క్రిప్ట్‌లను భద్రంగా పురావస్తుశాఖలో భద్రపరిచినట్టు భద్రపరిచే భామ... తన ఒరిజనల్ స్క్రిప్టు ఇంకా ప్రింటింగ్‌కు వెళ్లకముందే తనే ఫస్ట్ రీడర్ అయినట్టు చదివేసి అంతటితో ఊర్కోకుండా కొరికేసింది. అప్పటికీ క్లయిమాక్స్ పేపర్ ఎలుక కడుపులోకి వెళ్లి వాతాపి జీర్ణం అయిపోయింది.

అప్పుడు...ఆ ఎలుక మీద యుద్ధం ప్రకటించింది. యుద్ధప్రాతిపదిక మీద రంగం సిద్ధం చేసింది.

ఆ ఎలుకను తరిమేయడానికి ఇద్దరు కుర్రాళ్లను నియమించింది. ఆ ఎలుకవాళ్లతో హైడ్ అండ్ సీక్ గేమాడింది. కానీ దొరకలేదు. పట్టుకుంటే జారిపోయే సైజులో అది విన్యాసాలు చేస్తోంది.

మొదటిసారిగా లంకంత ఓల్డ్ టైప్ ఇల్లును తమకు అంటగట్టిన మామగారి మీద కోపం వచ్చింది. ఆ ఇంటిని కూల్చేసి డూప్లెక్స్ కట్టుకుందామండి అని మొగుడితో అంటే "ఆఁ పిల్లల పెళ్లయ్యేక, మనవళ్ళ బారసాలలు పూర్తయ్యాక చూద్దాం.." అన్న చందాన వాయిదా జవాబు రెడీగా పెట్టుకున్న మొగుడి మీద కోపం వచ్చింది.

లంకంత పురాతన ఇంట్లో డజనుకు పైగా రూమ్‌లు....అందులో సెంటిమెంట్ ఆయింట్‌మెంట్‌తో ఉన్న ఫర్నిచర్...హాయిగా ఓ క్రయిమ్ థ్రిల్లరో, హారర్ మూవీనో తీయడానికి పనికొచ్చే పురావస్తు టాగ్‌లైన్ ఉన్న ఇల్లు. అక్కడ ఎలుకకు కావలసినంత ప్రైవసీ ఉంది. ఆ ఇంటిని అది ప్లే గ్రౌండ్‌గా మార్చుకుంది.

సదరు కుర్రాళ్ళు ఎలుకను చంపడం మావల్ల కాదని చేతులు ఎత్తేశారు. కాళ్లు పీక్కుపోయాయని దండం పెట్టేశారు. ఆ నెలలో పదిహేనోసారి డాక్టర్ చెకప్‌కు వచ్చిన బాబాయ్ చెప్పిన సలహా విని ఓ పిల్లిని అద్దెకు తెచ్చుకుని మరీ ఆ ఇంట్లో వదిలింది సత్యభామ.

ఆ. పిల్లి దొంగది ఎలుకను భోంచేయడం మాని పాలు తాగడం....ఓవెన్‌లో ఉన్న చికెన్ సిక్స్‌టీఫైవ్‌లను తినడంలో బిజీ అయి ఇంకో తలనొప్పిగా మారింది.

ఆ విషయం బాబాయ్‌కి చెబితే "హ్రె(్రె... పోనీ కుక్కను ట్రయ్ చేయ్ కుక్కకు, పిల్లికి పడదు...పిల్లికి ఎలుకకు పడదు..బ్యాలెన్స్ అయిపోతుంది" అన్నాడు చిద్విలాసంగా.

తర్వాత తెలిసింది బాబాయ్ ఆ ఎలుకల బాధ ప్లస్ పిల్లల బెడద భరించలేక ఇల్లు ఖాళీ చేసి మరో ఇంట్లోకి మారాడని. ఇంకెప్పుడూ ఇలాంటి చచ్చు, పుచ్చు సలహాలు ఎవ్వర్నీ అడక్కూడదనుకుని బాగా ఆలోచించి ఫైనల్‌గా ఎలుకల మందు తెచ్చిపెట్టింది అదీ మోస్ట్ పవర్‌ఫుల్‌ది. ఈ దెబ్బతో ఎలుక పని అవుట్ అనుకుంది.

* * *

యధావిధిగా కాళ్లకు అడ్డం పడి న్యూసెన్స్ క్రియేట్ చేసే ఎలుక ఆ రోజు కనిపించలేదు. మధ్యాహ్నం....సాయంత్రం..రాత్రి ఎలుక జాడే లేదు.

ఎలుకకి పెట్టిన న్యూడుల్స్‌లో ఎలుక మందు సగం అయిపోయింది. అంటే తన ప్రయత్నం ఫలించిందన్నమాట. మరి ఎలుకేది? వెంటనే భర్తని రంగంలోకి దింపింది.

కొడుకుని సెర్చింగ్‌కి పంపింది. ఒక గదిలో నుంచి మరో గదిలోకి...అన్ని గదుల్లో వెతికింది. అంతా టేక్ ఉడ్‌తో చేసిన నగిషీలు చెక్కిన ఫర్నిచర్. గదికో టీవీ... మొగుడి వంక చురచురా చూసింది.

కిచెన్‌లో పోర్టబుల్, హాలులో హోం థియేటర్, బెడ్‌రూంలో ప్లాస్మా టీవీ, స్టడీరూంలో 21 అంగుళాల టీవీ, స్టోర్‌రూంలో 20 అంగుళాలు... చివరికి బాత్రూంలో బ్లాక్ అండ్ వైట్. అన్నింటికీ కేబుల్ కనెక్షన్లు. ఎందుకండీ ఇన్ని టీవీలు అంటే



మనమెప్పుడు, ఎక్కడ ఉన్నా అక్కడే టీవీ చూడొచ్చంటాడు. అన్ని టీవీలు సర్వకాల సర్వావస్థలయందు పవర్‌కట్ టైమ్‌లో తప్ప వర్కింగ్ మూడ్‌లోనే ఉంటాయి.

ఒళ్ళు మండింది సత్యభామకు. ఇంతకీ ఆ ఎలుక ఎక్కడ చచ్చి చచ్చింది?

★ ★ ★

మెల్లిమెల్లిగా కంపు మొదలైంది.

చచ్చికూడా సాధిస్తోంది ఆ ఎలుక అనుకుంది ముక్కుమూసుకుని.


ఎలుకను ఎంత ట్రేస్ చేసినా లాభం లేదు. వెంటనే సత్యభామకు ఓ తింగరి ఐడియా కూడా వచ్చింది.

ఈ వంకన ఇల్లు కూల్చేసి చచ్చిన ఎలుకను పట్టేస్తే భర్త అప్పుడైనా డూప్లెక్స్ కట్టిస్తాడేమో..



## నమ్మకం

'సూపర్' చిత్రంతో తెలుగు పరిశ్రమకు పరిచయమైన అనూష్క చాలా తక్కువ సమయంలోనే తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. 'విక్రమార్కుడు'లో తన అందచందాలతో యువతను గిలిగింతలు పెట్టిన ఈ కన్నడ భామ నాగార్జున హీరోగా రూపొందుతున్న 'డాన్', గోపీచంద్ హీరోగా నటిస్తున్న 'లక్ష్యం' చిత్రాలు తనకు మంచి పేరును తీసుకువస్తుందని నమ్మకంగా చెబుతోంది. సో...ఆల్ ది బెస్ట్ అనూష్కా!




క్షణక్షణానికి కంపు ఎక్కువైంది.

మార్చురీలో ఉన్న ఫీలింగ్ మొదలయింది. మొగుడు మాత్రం ఏ ఛానెల్ దానిదే అన్నట్లు ముక్కు మూసుకుంటూనే నోరు తెరిచేసి ఫుడ్ లాగించేస్తున్నాడు.

★ ★ ★

ఇక ఇలా లాభం లేదని చచ్చిన ఎలుకను ట్రేస్ చేయడానికి ఓ పథకం వేసింది. ఒక్కో రూమ్‌ని నీట్‌గా సర్దడం మొదలెట్టింది. అప్పటివరకూ పాత పేపర్లు, సామాన్లు కాళ్లకు అడ్డం పడే ఫర్నిచర్ ఉండేది. ఎప్పుడూ బద్ధకమే. ఇప్పుడిక తప్పదు కాబట్టి ఒక్కోగదిని నీట్‌గా సర్దుతూ ఎలుక కోసం వేట మొదలెట్టింది.

ఒకటా రెండా పెళ్లయి కాపురానికి వచ్చినప్పట్నుంచే కాదు వాళ్లత్తగారు ఉన్నప్పట్నుంచీ పేరుకుపోయిన చెత్త ఓ షేప్‌కు వచ్చేసరికి నలభై ఎనిమిదిగంటలు పట్టింది. ఒళ్ళు హూనమైంది.

★ ★ ★

ఇప్పుడు గదులన్నీ అద్దంలా మెరిసిపోతున్నాయి.

చివరికి స్టోర్ రూమ్ కూడా. సర్దడం అయిపోయాక కనిపించింది చచ్చిన ఎలుక. ఎదురుగా. బ్లాక్ అండ్ వైట్ పోర్టబుల్ 20అంగుళాల టీవీ నిరంతర ప్రసారాలతో వర్ధిల్లుతూనే ఉంది.

దాని ఎదురుగా విరిగిన కుర్చీలో చచ్చి పడి ఉంది ఎలుక. టీవీలో ఓ డైలీ సీరియల్ పద్నాలుగు వేల తొమ్మిదివందల తొంభై తొమ్మిదో ఎపిసోడ్ వస్తూనే ఉంది. ఎలుక కంటి దగ్గర కన్నీటి చారికలు.

★ ★ ★

పరీక్షించి చూస్తే అది పోయింది ఎలుకలమందు కలిపిన న్యూడుల్స్ వల్ల కాదని అనిపించింది.

ఆ ఎలుకమందు తిని మరింత వెయిట్ పెరిగింది. కానీ స్టోర్‌రూంలోకి వచ్చి టీవీలో సీరియల్స్ చూస్తూ కామెడీ సీరియల్స్ చూసి ఏడుస్తూ, ఏడుపుగొట్టు సీరియల్ చూస్తూ నవ్వుతూ న్యూస్‌ఛానెల్స్ చూస్తూ...చూస్తూ...చూస్తూ టీవేమియా సోకి చచ్చిపోయి ఉంటుంది. ప్చ్...పాపం... ఇంత బ్రతుకూ బ్రతికి ఎలుకమందువల్ల చావక, పిల్లి వల్ల చావక, మనిషి వల్ల చావక టీవీ వల్ల టీవీ ప్రోగ్రామ్స్ చూసి చచ్చిపోయింది.

★ ★ ★

ఆ రాత్రి ఎలుక పీడ వదిలిందని సంతోషిస్తూ తనను ఇంత టార్చర్‌కు గురి చేసి ఇంత ఖర్చు చేయించిన ఎలుక చావును ఎందుకు క్యాష్ చేసుకోకూడదని దాన్నే కామెడీ కథగా రాసింది సత్యభామ.

పొద్దున్నే కళ్ళు తెరిచి షాకైంది. స్క్రిప్ట్ కాయితాలని ప్లే గ్రౌండ్‌లా ఆడుకుంటూ ఎలుక... అచ్చంగా తనను ముప్పుతిప్పలు పెట్టిన ఎలుక.. టీవీ చూసి చచ్చిపోయిన ఎలుక..అచ్చం అలాంటి ఎలుకే ఇది.

తను రాసిన 'ఎ ఫర్ ఎలుక' అన్న టైటిల్ మీద ర్యాట్‌వాక్ చేస్తోంది ఎలుక.

"మమ్మీ..అది నిన్న చచ్చిన ఎలుక్కి ట్విన్ బ్రదరో, సిస్టరో అయి ఉంటుంది'' అన్నాడు రెండోవాడు అనురాగ్.

అప్పుడే కిచెన్‌లో ఉన్న ఫ్రిజ్‌లోని వాటర్‌బాటిల్ తాగడానికి తీసి "ట్విన్ కాదు సత్యా...త్రిక్స్...ఇక్కడింకోటి ఉంది'' అన్నాడు ఫ్రిజ్ పక్కనే ఉన్న మరో ఎలుకను చూస్తూ.

హ..తో...స్మి!

★